# వ్యక్తిత్వం

-వసంతకుమార్ సూరిశెట్టి



"ఏమిట్రా నువ్వు చెప్పేది. పెళ్లి ఇంకా రెండు వారాలే వుంది. అన్నీ సిద్ధం చేసుకున్న తరువాత పెళ్లి వద్దంటే ఎలా? ఆడపిల్ల వాళ్లకి ఏం సమాధానం చెప్పమంటావ్?" కోపంగా అడిగాడు పరంధామయ్య కొడుకు విజయ్‌ని చూస్తూ.

"చెబితే వినవెందుకు నాన్నా. ఈ పెళ్లి చేసుకోవడం నాకిష్టంలేదు."

"ఏమిట్రా నువ్వు చెబితే నేను వినాలా? నువ్వు పెళ్లి చేసుకుంటానంటే ఒప్పుకోవాలి. వద్దంటే మానేయాలి. పెళ్లంటే నీకొక ఆటలా వుంది. పెళ్లి ఆగిపోతే నీకేం బాగానే వుంటుంది. ఆడపిల్ల ఎన్ని సమస్యల్ని ఎదుర్కోవాలో నీకేమైనా తెలుసా? రేపు మళ్లీ ఆ అమ్మాయికి పెళ్లవుతుందా?"

"నావల్ల ఆ అమ్మాయి జీవితం నాశనం కాకూడదనే వద్దంటున్నా నాన్నా."

"నువ్వు పెళ్లి చేసుకుంటే అమ్మాయి జీవితం ఎందుకు నాశనం అవుతుందిరా?"

"పోయిన సంవత్సరం నాకు జరిగిన ఆక్సిడెంట్‌లో వెన్నెముకకి దెబ్బ తగలడంవల్ల దాంపత్య జీవితానికి పనికి రానని తెలిసింది నాన్నా."

విజయ్ చెప్పింది విని షాక్ కొట్టినట్టుగా వుండిపోయాడు పరంధామయ్య.

కొంచెంసేపయిన తరువాత మనస్సు స్థిమితపరచుకుని "సరే జరిగింది ఏదైనా మన మంచికే అనుకుందాం. నువ్వు ముందు పెళ్లి చేసుకో. ఆ తరువాత నాకు తెలిసిన డాక్టర్ ఒకాయన ఉన్నాడు. ఆయన దగ్గరికి వెళ్లి చూపిద్దాం" అన్నాడు పరంధామయ్య కొడుకు భుజం తడుతూ.

"ఏమిటి నాన్నా మీరనేది? ఇంత పెద్ద విషయాన్ని చెప్పి పెళ్లి వద్దని చెబితే ముందు పెళ్లి చేసుకో, తరువాత ఆలోచిద్దాం అంటారేమిటి? పెళ్లి అయిన తరువాత పిల్లలు పుట్టకపోతే అది ఎంత నరకయాతనో మీకు తెలియంది కాదు. మగవాడి కన్నా ఆడది ఎన్నెన్ని మాటలు పడాలో తలచుకుంటేనే భయంగా వుంది. ఇలాంటి పరిస్థితుల్లో నాకీ పెళ్లి అంత అవసరమంటారా? చెప్పండి నాన్నా. అబద్ధం చెప్పి ఒక ఆడపిల్ల జీవితం నాశనం చేయడం నాకిష్టంలేదు. ఇదే నా నిర్ణయం" అంటూ వేగంగా బయటకి వెళ్లిపోయాడు విజయ్.

తిన్నగా తనకు కాబోయే భార్య పని చేస్తున్న ఆఫీసుకెళ్లి ఆమెతో ఒక ముఖ్యమైన విషయం మాట్లాడాలని చెప్పాడు. ఉరుములు మెరుపులూ లేని వర్షంలా వచ్చిన విజయ్‌ని చూసి ఆశ్చర్యపోయింది అనూరాధ.

"రండి కాఫీ త్రాగుతూ మాట్లాడుకుందాం" అంటూ కాంటీన్ వైపు నడక సాగించింది అనూరాధ.

కాంటీన్‌లో ఎదురెదురుగా కూర్చున్న తరువాత జరిగింది చెప్పి "చూడండి అనూరాధ. నావల్ల మీ జీవితం నాశనం కావడం నాకిష్టంలేదు. అందువల్ల మీరే ఏదోక కారణం చెప్పి ఈ పెళ్లిని ఆపు చేయండి ప్లీజ్" అన్నాడు విజయ్ తల దించుకుని.

తన ఎదురుగా కూర్చుని వున్న ఒక అపూర్వ వ్యక్తిని తదేకంగా చూస్తూ "ఈ పెళ్లి ఆపవద్దు ప్లీజ్" అంది అనూరాధ ఒక నిర్ణయానికి వచ్చినట్టుగా.

"ఏమిటండీ మీరు చెప్పేది. మీకేమయినా పిచ్చా. ఇంత భయంకరమైన విషయాన్ని చెప్పి పెళ్లి ఆపమని చెబితే వద్దు పెళ్లి చేసుకుందాం అంటారేమిటండీ. మీకు చెప్పడానికి భయంగా వుంటే చెప్పండి. నేనే మీ వాళ్లతో మాట్లాడతాను" అంటూ లేచి నిలబడ్డ విజయ్ చెయ్యి పట్టుకుని ఆపి కూర్చోబెట్టింది అనూరాధ.

"మిమ్మల్ని చూస్తే నాకెంతో గర్వంగా వుందండి. తన దగ్గరే లోపం వుంచుకుని అది బయటకి చెప్తే అవమానమని, తన భార్యలోనే లోపముందని చెప్పుకునే మగవాళ్ల మధ్యలో మీరు నిజమైన మగాడు. నిజాన్ని దాచి పెట్టకుండా నా దగ్గరే చెప్పి పెళ్లి ఆపమని చెప్పడం మీ సంస్కారాన్ని తెలుపుతోంది. మీలాంటి వ్యక్తిని భర్తగా పొందడం నిజంగా చాలా అదృష్టం."

అనూరాధ మాటలకు అడ్డువచ్చి "మీరేమిటిలా చిన్నపిల్లలా మాట్లాడుతున్నారు. ఈ సమస్య మన జీవితాల్ని ఎంత అల్లకల్లోలం చేస్తుందో ఆలోచించలేకపోతున్నారు" అన్నాడు విజయ్.

"చూడండి విజయ్. నేను చెప్పేది పూర్తిగా వినండి. మనకి పిల్లలు పుట్టరనేగా మీ బాధ. పుట్టకపోతే పోనివ్వండి. మనిద్దరం హాయిగా వుందాం. ఒకవేళ పిల్లలే కావాలనుకుంటే బోలెడన్ని అనాధ శరణాలయాలు ఉన్నాయి. ఎవరో ఒకర్ని పెంచుకుందాం. ఒక వ్యక్తిత్వం, సంస్కారం లేని వాడికి భార్యనై వాడి పిల్లలకి తల్లిననిపించుకోడంకన్నా సంస్కారమున్న మీతో మంచి మనిషికి భార్యగా ఉండడానికే నాకు చాలా ఇష్టం. దీని గురించి ఇంక ఎలాంటి భేదాభిప్రాయాలు వద్దు" అన్న అనూరాధని తన్మయత్వంతో చూస్తూ ఉండిపోయాడు విజయ్.

★